# ఆత్మతత్త్వమే స్వాతంత్ర్యము

**నరజన్మమునందు పుట్టి నరజన్మమునందు పెరిగి**
**నరసింగములైనవారు తొలిసంగతి మరచినారు**
**మలిన దేహముపెంచి అసురత్వము స్వీకరించి**
**సమరాలను స్వాగతించి శాంతి సభలు జరుపుతారు.**

ప్రేమస్వరూపులారా!

ఈనాటి యుగప్రభావము ఈ రీతిగా నున్నది. మానవ సమాజములో ప్రధానముగా ఉండవలసినది మానవత. ఎంతటి మేధావి అయినా, ఎంతటి సైంటిస్టు అయినా, ఎంతటి విద్యావంతుడైనా వానితోబాటు మానవత్వాన్నికూడా అభివృద్ధి గావించుకోవాలి. మానవతనే కోల్పోయిన ఎన్ని శక్తులుండినప్పటికి, ఎన్ని విద్యలుండినప్పటికి, ఇవన్నీ కేవలము నిరర్థకములే! ఏనాడు మానవుడు ఈ మానవత్వాన్ని అభివృద్ధి గావించుకొనునో అప్పుడే సమాజము, దేశము, విశ్వము మానవత్వముతో విరాజిల్లుతాయి. ఈ మానవత ఒక్క ఆధ్యాత్మికమువల్లనే అభివృద్ధి కాగలదు. కనుక, మానవుడు మానవత్వాన్ని అభివృద్ధి గావించుకొనవలెనన్న మొట్టమొదట హృదయమునందు ఆధ్యాత్మికమనే ఎరువు వేసి, ప్రేమ అనే జలమును పెట్టి తద్వారా మానవతా విలువలు అభివృద్ధి గావించుకోవాలి.

**మానవ సమాజములో సమగ్రత, సమైక్యత అత్యవసరము**

మానవ జీవితములో నిత్యసత్యముగా ప్రకాశించే ప్రాచీన సంస్కృతిని కాలానుగుణ్యముగా అభివృద్ధి గావించుకోటం అనుసరించినప్పుడే మానవత్వము వికసిస్తుంది. మానవ సమాజములో సమగ్రత, సమైక్యత అత్యవసరము. ఈ సమగ్రత, సమైక్యత రెండు ఉండినప్పుడే మానవత్వము మరింత అభివృద్ధి చెందుతుంది. ఈ మానవతా విలువలు ఎక్కడనుంచి పొందాలి? ఏ విధముగా మనము అభివృద్ధి

srisathyasaivachanamrutam

గావించుకోవాలి? ఈ మానవతా విలువలు మానవునితో జన్మించాలి. మానవునితోబాటు మానవతా విలువలు చేరి ఉంటున్నాయి. మానవునకు, మానవతా గుణములకు ఏమాత్రము వేరుబాటులేదు. ఇవి అవినాభావ సంబంధము. అట్టి అవినాభావమైన మానవత్వమును ఈనాడు విస్మరించి మానవునిగా మాత్రమే జీవించాలని ప్రయత్నిస్తున్నారు. ఆధ్యాత్మిక మార్గములో సాధనలో అష్టసాధనలుంటున్నాయి-యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి అని.

ఇందులో మొట్టమొదటిది యమ. ఇది ఒక్కటి గుర్తించుకుంటే చాలు. ఇందులోనే సర్వమానవతా విలువలు ఉంటున్నాయి. మానవత్వమంతా ఇందులోనే ఇమిడి ఉంటున్నది. యమ అనేదానిలో పంచప్రాణము లుంటున్నాయి. ఇందులోనే పంచకోశములుంటున్నాయి. ఈ పంచ రూపములే గాయత్రి స్వరూపము అని. అవియే అహింస, సత్యము, ఆస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము. ఈ ఐదు యమములో చేరియున్నాయి.

**అహింసా పరమోధర్మః**

మొదటిది అహింస. దీనిని బౌద్ధమతములో ప్రధానముగా బుద్ధుడు బోధిస్తూ వచ్చాడు. ఇదియే ప్రథమ ధర్మమని నిరూపిస్తూ వచ్చాడు. 'అహింసా పరమోధర్మః' అన్నారు. 'హింస' అనగా ఏమిటి? ఇతరులను బాధించటము, ఇతరులను కష్టపెట్టటము, ఇతరులను హింసించటము, ఇతరులను నొప్పించటము. ఇతరులను బాధించకూడదని అన్నంత మాత్రమున అది అహింస అని చెప్పటానికి వీలులేదు. అహింస అనగా ఇతరులను బాధించకుండా ఉండడమేకాక తనను తానుకూడా బాధించుకోకుండా చూచుకోవాలి. తనను బాధించుకున్నవాడు ఇతరులను బాధించక తప్పదు. మొట్టమొదట అహింసా ధర్మమును ఆచరణలో పెట్టదలచిన వ్యక్తి తనను తాను హింసించుకోకుండా చూచుకోవాలి. ఇది ఏవిధముగా? తన నడతయందు సరైన మార్గమున్నదా లేదా అనే విచారణ చేసుకోవాలి. అదికూడ అహింసయే! వాక్కునందుకూడా ఇది పరులను బాధించే వాక్కా, కాదా అనే విచారణ సల్పాలి. తన చూపులందు దుర్మార్గమైన, దుష్ట సంకల్పముతోకూడిన



sri sathyasai vachanamrutam

చూపులు ప్రవేశించకుండా చూచుకోవాలి. చెడు విషయమును వినకుండా చూచుకోవాలి. ఇవన్నీ తననే బాధిస్తున్నాయి. కనుకనే చెడ్డచూపు లేకుండా, చెడ్డమాటలు వినకుండా, చెడ్డమాటలు లేకుండా, చెడ్డతలంపులు లేకుండా, చెడ్డపనులను చేయకుండా చూచుకోవాలి.

## అంతరాత్మకు విరుద్ధముగా నడుచుకోవటమే చెడ్డ

చెడ్డ అనగా ఏమిటి? కేవలం మన conscience కి వ్యతిరేకంగా ప్రవర్తించటమే చెడ్డ. ఈ conscience కి విరుద్ధముగా మనము నడచుకున్నప్పుడు ఇందులో అన్నీకూడ మనకు చెడుపులే జరుగుతాయి. కనుక ఈ conscience మనలోనున్న దైవస్వరూపము. ఏ పనిచేసినా ఇది సరికాదు, ఇది సరి అని నిర్ణయం చేస్తుంది. అయితే ఈ conscience విచారణ చేయడానికి కొంతకాలం తీసుకోవాలి. ఇందులో తొందరపాటు పనికిరాదు. ఏదైనా ఒక మాట అనాలని అనుకున్నప్పుడు కొంత యోచించి Is it right or wrong, is it good or bad అని విచారణ చేసి ఆ మాట ప్రవేశపెట్టాలి. ఏదైనా ఒక విషయాన్ని వినాలనుకున్నప్పుడు ఇది మంచిదా చెడ్డదా? ఇది నాకు సరైనదా కాదా అనే విచారణ చేసుకుంటూ నిర్ణయం తీసుకోవాలి. కేవలం ఈ పంచభూతములతో అనుభవించేది మాత్రమే కాకుండా భుజించే విషయములోకూడా జాగ్రత్తగా ఉండాలి. అతిగా భుజించటంకూడా హింసగా ఉంటుంది. కనుక, మితంగా భుజించినప్పుడే మనకు హాయిని చేకూరుస్తుంది. కనుక, మనకు సుఖము ఇచ్చేదే అహింస. తనను బాధించునదే హింస. అంతేకాదు, త్రాగేనీరుకూడా సరైన స్థితిలో మితంగా తాగాలి. అదే విధంగా మన జీవితమంతా అహింసామయంగా ఉండాలి. మనం స్నానంచేసే సమయములో అనేక క్రిములు మరణిస్తూ ఉంటాయి. మనం నడచేటప్పుడు అనేక జీవులు మరణిస్తున్నాయి. మనం చేసే పనులలో అనేక రకములైన క్రిములు నశిస్తూ ఉంటాయి. అంతవరకు పోనక్కరలేదు. మనం పీల్చేగాలిలోకూడా ఎన్నో క్రిములన్నీ నశిస్తూ ఉంటాయి. ఇవన్నీకూడా హింసతోకూడినవే! అందువలనే ఈ హింస మనలను బాధించకుండా చూచుకోవాలన్నప్పుడు 'సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థం' అనే భావముతో మనం ఆచరిస్తే ఈ

sri sathyasai vachanamrutam

హింస మనలను బాధించదు. అట్లని తెలిసికూడా జీవులను బాధించి 'సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థం' అంటే ప్రయోజనంలేదు. ఈ conscience ను వేదాంత పరిభాషలో 'చిత్' అన్నారు. ఈ చిత్‌నే awareness అన్నారు. అనగా పరిపూర్ణముగా గుర్తించటమే! మన మనసునందే ఉంటున్నది. ప్రతి మానవుడు ఇట్టి పరిపూర్ణ స్థితి అందుకోటానికి తగిన కృషిచేయాలి. కనుక అహింస మానవునిలోని మొట్టమొదటి ధర్మము.

**త్రికాలములందు మారకుండా ఉన్నదే సత్యము**

రెండవది సత్యము. ఈ సత్యమనగా ఏమిటి? చూచినది చెప్పటము, వినింది చెప్పటము, చెప్పినది చెప్పటము, చేసింది చెప్పటము ఇంతమాత్రమే సత్యముకాదు. ఇదంతా కేవలము ప్రాకృతమైన సత్యము. నిజంగా హృదయ పూర్వకంగా నీ conscience కి తృప్తిగా నీవు మాట్లాడటం సత్యంగా అన్వయిస్తుంది. దీనినే 'ఋతం' అని చెప్పవచ్చు. ఇది త్రికాలా భాద్యం. ఇది మూడు కాలములందు మారనిది. దేశకాల పరిస్థితుల ప్రభావములకేమాత్రము లొంగనిది. మారిస్తే మారేదికాదు. దీనిని ఏవిధంగా దాచినా దాగేదికాదు. సత్యం సత్యప్రధానము. కనుక 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ'. ఈ సత్యమే దైవస్వరూపము. కనుక సత్యము ప్రధానమైన రెండవ మానవతా విలువ.

**ఆస్తేయమనగా పరుల వస్తువులు అపహరించకుండా ఉండటం**

మూడవది ఆస్తేయము. ఆస్తేయమనగా ఏమిటి? ఆస్తేయమనగా పరుల వస్తువులు అపహరించకుండా ఉండటమే! ప్రోపరిటి అంటే కేవలం ఏదో ఒక బుక్కో, పెన్నో యింకే పదార్థమైన కావచ్చు. ఏదైనా నీకు అవసరమైనప్పుడు ఆ వస్తువు యజమానియొక్క పర్మిషన్ తీసుకొని ఆ వస్తువు తీసుకోవాలి. అట్టి పర్మిషన్ లేకుండా ఆ వస్తువు తీసుకోటం దొంగతనముక్రిందకే వస్తుంది. లేక పరుల విషయంలో విమర్శించటం, అతనికి బాధకలిగేటట్లుగా ప్రవర్తించటంకూడా ఆస్తేయం క్రిందనే వస్తుంది. ఇది దొంగతనము క్రిందకే వస్తుంది. దొంగతనమంటే ఏమిటి? ఏదో ఒక పదార్థాన్ని మనం అందుకోటం. ప్రతి పదార్థమునకు ఒక్కొక్క యజమాని ఉంటున్నాడు. ఆ యజమాని అనుమతి పొంది ఆ పదార్థమును మనం అనుభవించాలి. ఇదిచాలా వరకు పిల్లలలో జరుగుతుంది. ఒకని

sri sathyasai vachanamrutam

కెమేరా తీసుకొని ఇంకొకడు ఫొటోలు తీస్తూ ఉంటాడు. అయితే కెమేరా యజమాని పర్మిషన్ తీసుకొని దీనిని ఉపయోగించవచ్చు. పర్మిషన్ తీసుకొని ఉపయోగించితే అదేమైనా చెడిపోతే ఆ బాధ్యత నీకొస్తుంది. కాబట్టి ఆ కెమేరా పాడుచేయడం ఒక విధంగా ద్రోహం చేయటమే అవుతుంది. ఈ విధంగా నిత్యజీవితంలో ఏ చిన్న విషయం అయినా అనేక రకములుగా విచారణ చేసినప్పుడు ఈ ఆస్తేయము ప్రత్యక్షంగా గోచరిస్తుంది. అనగా పరుల వస్తువులు మనము ఏమాత్రం తీసుకోకూడదు. పర్మిషన్‌తో తీసుకున్నప్పటికి పొరపాట్లు రావచ్చును. కొన్ని చెడిపోవచ్చు. తద్వారా నీ మనసుకు కష్టం కల్గించటం తిరిగి అహింస క్రిందకే వస్తుంది. అన్నింటికి ఒకదానికొకటి సంబంధ బాంధవ్యముంటున్నది. ఎవరి వస్తువు మనం తీసుకోరాదు. ఒకవేళ మీకవసరమైతే వారి పర్మిషన్ తీసుకొని నీవు అనుభవించవచ్చు. ఆ వినియోగంకూడా సరైన రీతిలో ఉండాలి. అట్లు సరైన వినియోగం చేయకుండా ఉండినప్పుడు ఆ వ్యక్తికి మనం కొంత కష్టం కలిగించినవారమవుతాము. ఆస్తేయము మానవుని ప్రధానమైన మూడవ మానవతా విలువ.

## నిరంతరము దైవచింతనలో కాలము గడపటమే బ్రహ్మచర్యము

ఇక బ్రహ్మచర్యము. బ్రహ్మచర్యమనగా ఈ లోకంలో అనేకమంది అనేక రీతులుగా ఊహిస్తూ ఉంటారు. వివాహము చేసుకోకుండా ఉండటము బ్రహ్మచర్యమనుకుంటారు. అదికాదు, నిజమైన బ్రహ్మచర్యము. ఇది లోక సంబంధమైన బ్రహ్మచర్యము. బ్రహ్మచర్యమంటే బ్రహ్మములో చరించటమే. నిరంతరము దైవచింతనలో మనకాలమును గడపుకోటమే బ్రహ్మచర్యము. 'చర్య' అనగా ప్రవర్తన. బ్రహ్మములో చరించటమే బ్రహ్మచర్యము. వివాహము చేసుకోకుండా ఉన్నంతమాత్రమున బ్రహ్మచర్యము కాదు. అవివాహితుడు అంటారు. అంతే! వివాహం చేసుకుంటే అతనిని గృహస్థు అంటారు. గృహస్థధర్మంలోకూడా బ్రహ్మచర్యముంటుంది. అనగా గృహస్థు తన అర్ధాంగితో మాత్రమే జీవితము గడపటంకూడా బ్రహ్మచర్యమే! అట్లుకాకుండా పెడ మార్గములో మనసును ప్రవేశింపచేస్తే అది బ్రహ్మచర్యం కానేరదు. కనుక గృహస్థధర్మంలోకూడా బ్రహ్మచర్యం చెడిపోతుంది. శారీరకంగా మాత్రమేకాదు. మానసికంగా ఎట్టి పెడమార్గములుగానీ,

srisathyasaivahini

తలంపులకుగానీ అవకాశము ఇవ్వకూడదు. ప్రాచీన మహర్షులందరు ఈ విధమైన మార్గమును అనుసరించటంచేతనే ఆనాటినుండి ఈ మానవతా విలువలు మానవత్వమునకు ప్రధానమైన ప్రాణములుగా పోషిస్తూ వచ్చారు. బ్రహ్మచర్యమనే దానిలో చాలా అంతరార్థము ఇమిడి ఉంది. మీకు తెలియకుండా అనేక కష్టనష్టములు జరుగుతుంటాయి. మన శక్తిని వృధా చేస్తుంటాము. ఇదంతా బ్రహ్మచర్యమునకు విరుద్ధమైన మార్గమే! బ్రహ్మచర్యము విషయంలో ఇంద్రియములను జయించటం అంత సులభముకాదు. ప్రాచీనకాలమునుండి భారతీయులు ఇలాంటి పవిత్ర సాధనలు సల్పుతూ రావటంచేత భారతదేశంలో ఇలాంటి ధర్మములు ఈనాటికికూడా ఏవిధమైన అపకారం లేకుండా అనుభవిస్తూ వస్తున్నారు. నిజంగా భారతదేశమునకు కలిగిన కష్టములు, నష్టములు, దుఃఖములు, విచారములు ఎన్నో జరిగాయి కానీ ఎన్ని జరిగినప్పటికిని ఈ మానవతా విలువలు అనాది కాలమునుండి కాపాడుకుంటూ, పోషించుకుంటూ, రక్షించుకుంటూ వచ్చారు.

**ఇతరులనుండి ఏ పదార్థమును తీసుకోకుండా ఉండటమే అపరిగ్రహము**

ఐదవది అపరిగ్రహము. ఇతరులనుండి మనము ఏ పదార్థమును అందుకోకూడదు. లోకములో తల్లి, తండ్రి ఉన్నారు. తల్లితండ్రులదగ్గర ఏదైనా తీసుకోవటానికి నీకు అధికారముంది. తల్లితండ్రులకు నీవు ప్రతిబింబస్వరూపుడవు. కనుక ఆ తల్లితండ్రులు ఏది ఇచ్చినా నీవు అందుకోటం ధర్మమే! అపరిగ్రహములో సూక్ష్మమైన విషయాలు ఉంటున్నాయి. అత్తమామలు ఇచ్చినా పుచ్చుకోకూడదన్నారు. ఇంతేకాదు, అన్నదమ్ములు ఇచ్చినా పుచ్చుకోకూడదు. ఒకవేళ పుచ్చుకున్నప్పటికి, దానికి బదులు నీవు ఇంకొకటి ఇచ్చుకోవాలి. లోకములో ఈ పరిగ్రహము మితిమీరిపోయింది. మీరు విద్యనభ్యసించి, ఉన్నతస్థాయి పొంది వివాహమాడినప్పుడు ఇంత వరకట్నమని తీసుకుంటున్నారు. ఇది చాలా తప్పు. దాన్ని మీరు తీసుకుంటే దానిలో చాలా పాపం ఉంది. అపరిగ్రహము పాటించి మీరు ఏమీ ముట్టుకోకుండా ఉండాలి. ఏవిధంగా? 'తమ బిడ్డను ఇరవై, ఇరవైరెండు సంవత్సరములు పెంచి, పెద్దచేసి, అభివృద్ధి గావించి, విద్యాబుద్ధులు నేర్పి కట్టకడపటికి నా

sri sathyasai vahini amrutam

చేతికి ఇచ్చారు. అదే ఒక పెద్ద బహుమతి' అనుకోవాలి. ఆ బిడ్డతోబాటు తిరిగి ధనం ఎందుకు నీకు? తల్లితండ్రులు ఆ బిడ్డకేమైనా ఇచ్చుకోనీ! ఆ బిడ్డకు తల్లితండ్రులు ఇచ్చుకోటంలో ఏ దోషంలేదు. నీవు పుచ్చుకోటం చాలా తప్పు. ఈ విధమైన తృప్తిని మనం పొందుతూ రావాలి. అలా తృప్తిని పొందలేనప్పుడు పరిగ్రహమవుతుంది. సరైన రీతిలో మనము వేదప్రమాణమును అనుసరించాలంటే ఆ బిడ్డనుకూడా తీసుకోకూడదు. ఈనాడు భారతదేశము ఇలాంటి ధర్మాలకు విరుద్ధంగా ప్రవర్తించటంచేత మనకు తెలియని బాధలు, తెలియని కష్టములు, తెలియని దుఃఖములు మనలను ఆవరిస్తున్నాయి. అయితే తల్లితండ్రులదగ్గర, గురువుదగ్గర, దైవందగ్గర వీనికి మాత్రం మినహాయింపు ఉంది. తల్లితండ్రులదగ్గర ఏదైనా పుచ్చుకోవచ్చు. ఎందుకనగా వారియొక్క ప్రతిబింబమే నీవు. తల్లితండ్రులకు నీవు reaction, reflection, resound. వారినుండి వచ్చినవాడవని నీవు భావిస్తున్నావు. కాదు. వారిద్వారా వచ్చావు నీవు జగత్తుకు. కనుక వారిద్వారా ఏమైనా పొందవచ్చు. పుత్రుడు తండ్రికి ఆత్మ స్వరూపుడే! కనుక తల్లితండ్రుల దగ్గర తీసుకోటంలో ఎట్టి దోషములేదు. అయితే ఆ తల్లితండ్రులదగ్గర పోట్లాడి, కోర్టుకు పోయి, ఇంకే విధమైన వ్యవహారములు జరిపి తీసుకోకూడదు. తల్లితండ్రులు ప్రీతి పూర్వకముగా ఇచ్చినది తీసుకోవాలి. నాకు right ఉందికదాయని fight చేయకూడదు. అలా చేయటం పరిగ్రహము.

ఈ అపరిగ్రహము అనే దానిలో ఎంతో పవిత్రత ఉంది. తల్లితండ్రుల దగ్గరైనా కొంత లిమిట్ ఉంది. కానీ దైవముదగ్గర ఏ లిమిట్ లేదు. ఏది ఇచ్చినా పుచ్చుకోవచ్చు. ఎందుకంటె అన్నింటికి అధిపతి తానే! అన్నింటికి తాను తగిన శక్తివంతుడు. ఈ పరిహారంకూడా తాను చేయగలడు. దుఃఖనివారణకూడా గావించగలడు. కనుక ఏదైనా పుచ్చుకోటానికి మీకు అధికారం ఉంది.

**త్వమేవ మాతా చ పితా త్వమేవ త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ**
**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవదేవ.**

అంతా తానే అయినప్పుడు అత్త, మామ, తల్లి, తండ్రి ఇవన్నీకాదు ప్రత్యేకంగా. భగవంతుని మీరు తల్లి, తండ్రి అనే భావంతో భావించకూడదు. తల్లి అంటే నీకంటే ప్రత్యేకమైపోతుంది.

srisathyasaivahini.org

తండ్రి అంటే నీకంటే ప్రత్యేకమైపోతాడు. ఈ సంబంధ బాంధవ్యములు భగవంతుని దగ్గర భావించరాదు. నీవే నేను, నేనే నీవు. అంతేగానీ తండ్రి, తల్లి అనే సంబంధములు కొంతవరకు బంధుత్వాన్ని కలిగిస్తాయి. ఈ బంధనచేతనే మరికొన్ని బాధలు కలుగుతుంటాయి. అందరు పుట్టినది ఒకే స్థానమునుండి. వివిధ నామరూపములుండినప్పటికి అందులో అందరికి ఏకత్వమనే ఆత్మతత్త్వముగా ఉంటుంది.

**భిన్నత్వముతో కూడినదే అజ్ఞానము**

దీనికి చిన్న ఉదాహరణము. అనంత సముద్రములో అసంఖ్యాకమైన అలలు ఉద్భవిస్తుంటాయి. ఒక అల ఉండినట్లుగా మరొక అల ఉండదు. ఒక్కొక్క అల ఒక్కొక్క తీరుగా ఉంటుంది. ఒక్కొక్క అల ఒక్కొక్క రూపంగా ఉంటుంది. అన్ని అలలు సముద్రములోనివే! అదే విధంగా సచ్చిదానంద సాగరమందు మానవ జీవితములనే అలలు వేరు వేరు రూపనామములతో వస్తూ ఉన్నాయి. కానీ ఈ రూపనామములందున్న సచ్చిదానందమనే సముద్ర జలము ఒక్కటే. ప్రతి మానవునియందు సచ్చిదానందము సహజపూర్వకంగా ఉంది. ఈ సచ్చిదానందముకోసము మనము ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాము. ఇది మన అజ్ఞానము. అజ్ఞానమునుండి అవివేకము, అవివేకమునుండి అహంకారము, అహంకారమునుండి రాగము, రాగమునుండి ద్వేషము, ద్వేషమునుండి కర్మ, కర్మనుండి జన్మ. మన జన్మకు మూలకారణం కర్మ. కర్మకు మూలకారణము ద్వేషము. ద్వేషమునకు మూలకారణం రాగము. రాగమునకు మూలకారణము అహంకారము. అహంకారమునకు మూలకారణం అవివేకం. అవివేకమునకు మూలకారణము అజ్ఞానం. అన్నీ అజ్ఞానమునుండే ఆవిర్భవిస్తున్నాయి. ఈ అజ్ఞానమంటే ఏమిటి? భిన్నత్వముతో కూడినదే అజ్ఞానం. అది వేరు, నేను వేరు అనే భిన్నత్వమే అజ్ఞానము. అంతా దైవముయొక్క అంశయే. అగ్ని మండుతూ ఉంది. అగ్నికణములు కొన్ని లేచిపోతుంటాయి. అగ్నికణములు అగ్నినుండి ఆవిర్భవించినవే! అయితే అగ్నికి సమీపంలో ఉన్నంతకాలము, అగ్నిలోనున్న గుణములు అన్నీ అణువులో ఉంటున్నాయి. ఈ అణువులు కొంతదూరంపోతే అగ్ని ఆరిపోతుంది. బొగ్గుగా తయారౌతుంది. అదే విధముగా భగవంతునికి సమీపంగా

srisathyasaivachanamrutam

ఉన్నంతకాలము ఆ భగవంతునిలో నుండే సచ్చిదానంద గుణములు ఇందులోకూడా ఉంటాయి. ఈ అగ్నికణములు ఈ అగ్నినుండి దూరంగాపోతే బొగ్గుగా మారిపోతుంది. వాటిప్రకాశము ఆగిపోతుంది. పేరు మారిపోతుంది. వారే అజ్ఞానస్వరూపులు.

## ఏకాత్మభావముతో ఉండేది జ్ఞానము

గ్రంథాలు నేర్చుకున్నంతమాత్రమున, శాస్త్రములు తెలుసుకున్నంతమాత్రమున జ్ఞానులుకారు. జ్ఞానమంటే ఏమిటి? 'అద్వైత దర్శనం జ్ఞానం'. ఏకాత్మ భావంతో ఉండేది జ్ఞానం. ప్రతి ఒక్కటి మనయందే ఉంటున్నది. ఆ సచ్చిదానందము నీయందే ఉంటున్నది. ఆ ఆనందమునకు సత్‌చిత్‌లను అభివృద్ధి చేసుకోవాలి. అప్పుడే 'వ్యక్తి' అనే పేరు సార్థకమవుతుంది. అక్కడ వ్యక్తి ఉన్నట్లుగా కనిపిస్తుందంటావు. అందరికి ఈ వ్యక్తి అనే పదం సమన్వయం కాదు. వ్యక్తి అనే పదము ఎంతో విలువైనది. కానీ ఈ విలువను మనం తెలుసుకోకుండా కనిపించినవారినంతా వ్యక్తి అని పిలచి, ఈ పవిత్రమైన పదమును అపవిత్రము గావిస్తున్నాము. ఎట్టి పదములుగాని మనం తెలుసుకొని ఉపయోగించాలి. వ్యక్తి అనగా ఎవరు? అవ్యక్తంగా, అగోచరంగా తనయందున్న ఆత్మశక్తిని ఎవరు వ్యక్తీకరింపచేస్తే వాడు మాత్రమే వ్యక్తి. సచ్చిదానందములు అవ్యక్తంగా మనలోనే ఉన్నాయి. చాలా గూఢంగా ఉంటున్నాయి. దానిని మీరు ఆవిర్భవింప చేసుకోవాలి. దాని ఆనందమును అనుభవించాలి. అప్పుడే నీవు వ్యక్తిగా రూపొందుతావు.

## పరమాత్మతోకూడిన ఆనందమే శాశ్వతానందము

సత్ అనగా being, చిత్ అనగా awareness. Being అనగా ఎప్పటికి ఒకే మాదిరిగా ఉంటుంది. ఎప్పటికీ ఒకేలా ఉండేది మాధుర్యము. ఇదే స్వీట్‌నెస్. స్వీట్‌నెస్ అనగా చక్కెరగానీ, బెల్లంగానీ. అది నీటిలో వేసినా తీయగానే ఉంటుంది. పాయసంలో వేసినా, టీలో వేసినా, పాలలో వేసినా తీయగానే ఉంటుంది. దేనిలో వేసినా ఆ తీయదనం మాత్రం పోవటంలేదు. కనుక అది ఎప్పటికీ ఉండేది సత్. మీకోసం ప్రపంచస్థాయికి తీసుకువచ్చి ఉదాహరణకు చెబుతున్నానుగానీ చక్కెర అంటే సత్‌కాదు. అర్థమవటంకోసం చెబుతున్నాను. ఇది ఎప్పుడూ తీయగానే ఉంటుంది. దీని గుణము ఇది. క్వాంటిటీ ఎంతైనా



sri sathyasai vachanamrutam

క్వాలిటీ ఒకటే! అదే సత్. అది ఒక చేతిలో పెట్టుకొందాం. ఇంకోటి చిత్. ఎప్పుడూ పరిపూర్ణ జాగరూకతతో ఉండి కదలుతూ ఉంటుంది, జలము. ఎందుకు దీనికి 'చిత్' అని పేరు పెట్టారు? ఇది కొండపై పోసినా క్రిందకే వస్తుంది గానీ పైకి వెళ్లదు. ఎప్పుడూ కదలిపోతూనే ఉంటుంది. జ్ఞానము అనేకరకములుగా మారదు, కానీ కదలుతూ ఉంటుంది. కనుక 'చిత్' అనేది జలము. 'సత్' చక్కెర. 'చిత్' జలము. ఈ రెండింటిని మనం కలిపినప్పుడు చక్కెర అనము, నీరు అనము, 'పానకము' అంటాము. చక్కెర పేరు పోయింది. నీరు పేరు పోయింది. 'సిరప్' అని మూడవ పేరు వస్తుంది. సత్‌చిత్ రెండూకూడిన ఆనందము మనలో అవిర్భవిస్తుంది. ఈ ఆనందము మన విద్యలో నున్నదని భావిస్తున్నాము. వివాహములో నున్నదని భావిస్తున్నాము. ఉద్యోగములో ఉందని భావిస్తున్నాము. పిల్లలలో, ఆస్తిపాస్తులలో ఆనందముందని భావిస్తున్నాము. దీనిలో ఏమీలేదు. మీరే చూడండి. నేను పరీక్ష ప్యాసైతే ఆనందమంటావు. ప్యాస్ అయినావు. ఆనందం నిల్చిందా? తిరిగి పైచదువుకు పోవాలని చూస్తున్నావు. సీటు సాధించిన ఆనందం అంటావు. పీజి చేశావు. ఆనందం ఉందా? లేదు. ఉద్యోగానికి ట్రై చేయాలంటావు. ఉద్యోగం చిక్కింది. ఆనందం వచ్చిందా? ఒకటి లేదా రెండు సంవత్సరములు కాగానే ప్రమోషన్ కావాలంటావు. తిరిగి ప్రమోషన్ వచ్చాక ఆనందం వచ్చిందా? లేదు. పెళ్లి అంటావు. పెళ్లి చేసుకున్నావు ఆనందం వచ్చిందా? లేదు. కొడుకు కావాలంటావు కొడుకు కల్గాడు. ఆనందం వచ్చిందా? లేదు. వాడికి ఆస్తిపాస్తులు సంపాయించాలంటావు. సంపాయించావు. ఆనందం వచ్చిందా? కొడుకుకి, నీకు విరుద్ధభావం ఏర్పడింది. ఆస్తిలోపల తిరిగి ఆనందం వచ్చిందా? లేదు. ఇవన్నీ తాత్కాలికమైన ఆనందములే! మనకు ప్రాకృత సంబంధ వస్తువులతో సంబంధ బాంధవ్యము కలిగించేది ఆనందం కాదు. పరమాత్మతోకూడిన ఆనందము శాశ్వత ఆనందం. Happiness is union with GOD. ఈ సత్యాన్ని పిల్లలు గమనించుకోలేక ఈ ప్రాకృతమైన ఆనందముల కోసమని, సుఖాలకోసమని ప్రాకులాడుతున్నారు. మనస్సు పరిపక్వ స్థితికి వచ్చినప్పుడే అది గుర్తించటానికి వీలవుతుంది.

**ప్రేమ జలము వర్షించినప్పుడే సచ్చిదానందమనే మొక్కలు ఆవిర్భవిస్తాయి**

sri sathyasaivachanamrutam

ఎండాకాలములో ఈ గ్రౌండు ఎంత చక్కగా ఉంటుంది! ఒక్కమొక్కకూడా ఉండదు. బీచ్‌కి వెళ్ళి చూస్తే చక్కని యిసుక ఉంటుంది. రెండవదినం వర్షం వస్తే మూడవ దినం పచ్చని గడ్డి మొలుస్తుంది. గడ్డి ఎక్కడనుండి వచ్చింది? నిన్న లేదే? ఈ రోజు ఎలా వచ్చింది? నిన్నకూడా ఉంది, విత్తనరూపంలో. ఈనాడు మొక్క రూపం ధరించింది. అదే రీతిగా మనలో సత్‌చిత్ ఆనందములు ఒక విత్తనరూపంలో ఉంటున్నాయి. సచ్చిదానందములు లేవే లేవే యని దిగ్భ్రాంతి పొందుతున్నావు. దైవ ప్రేమ అనే జలం వర్షింపచేస్తే అక్కడనుండి ఆవిర్భవిస్తుంది. ఆ ప్రేమ అనే జలము అక్కడ పోసినప్పుడే సత్‌చిత్ ఆనందమనే మొక్కలు అవిర్భవిస్తాయి. ఆ ప్రేమ మనం ప్రకృతిపై ప్రసరింప చేస్తున్నాం. అందువలనే ఈ ఆనందమునకు దూరమై పోతున్నాము.

ఈనాడు అనేకమంది సైంటిస్టులు ఎన్నో యంత్రాలు కనిపెడుతున్నారు. ఎన్ని శక్తులనో కనిపెడుతున్నారు. కాని, శాంతికి అతి దూరమైపోతున్నారు. వేదాంతమును అర్థము చేసుకోలేకపోతున్నారు. తమ తత్వము తాము గుర్తించుకోలేకపోతున్నారు. ప్రాకృతమైన పేరుకోసం ప్రాకులాడుతున్నారు. అందువల్ల నిజమైన ఆనందము తమదగ్గర ఉండికూడా తాము అనుభవించలేకపోతున్నారు. మనయందే సర్వానందములు ఉంటున్నవి. మనయందే ఉంది దైవత్వము. మానవతా విలువలు మనం పెంచుకున్నప్పుడే ఇవన్నీ గుర్తించటానికి వీలవుతుంది.

**విద్యార్థులు మొట్టమొదట అహింసను గుర్తించాలి**

అష్టాంగ యోగములలో 'యమ' అనే దాన్ని గుర్తిస్తే చాలు. మిగిలిన యోగములు ఇందులోనే ఉంటున్నాయి. దీనిలో అహింస, సత్యము, బ్రహ్మచర్యము, ఆస్తేయము, అపరిగ్రహము అనే ఈ ఐదుకూడా బహిర్ ప్రాణములుగా నిలచి ఉంటున్నాయి. విద్యార్థులు మొట్టమొదట అహింసను గుర్తించాలి. ఈనాటి పరిస్థితులలో దీనినే అభివృద్ధిపరచాలి. ఈనాడు ఎక్కడ చూచినా అశాంతి, అల్లకల్లోలమే! మీ భావములు పరిశుద్ధంగా ఉండటం లేదు. ఎందుకంటే గాలిలో వచ్చేవన్నీ నీలో చేరిపోతున్నాయి. చూడండి, గాలిలో సర్వశక్తులు ఉన్నాయి. మీకు తెలియదు. విద్యుత్ తరంగములు సర్వత్రా ఉన్నాయి. ఇక్కడ రేడియో పెట్టి

sri sathyasai vahini

చూడండి. మీకేమీ విన్పించటంలేదు. మద్రాసు రేడియోస్టేషన్‌లో ప్రోగ్రాములు జరుగుతున్నాయి. దాన్ని ఆన్ చేసి ట్యూన్ చేయి. స్టేషను, వాల్యూమ్ పెడితే సాక్షాత్ అదే వస్తుంది. ఆ పాట యిక్కడ వినిపిస్తుంది. మద్రాసునుండి ఇక్కడ రావాలంటే ఎంత టైము పడుతుంది? అక్కడ పాడుతున్నప్పుడే ఇక్కడ క్షణంలో వస్తోంది. ఇదంతా ఎక్కడనుంచి వచ్చింది? తరంగములుంటున్నాయి. విద్యుత్ తరంగములు. అదే తేజస్సు అన్నాము. అదే దైవ స్వరూపము.

**ఏకాగ్రతకు, ధ్యానానికి మధ్యనున్న భేదమును గుర్తించాలి**

మీకింకా తెలియదు బంగారూ! చాలామంది సైన్సులో గుర్తించి ఉంటారు. మద్రాసు తరంగాలు వస్తున్నాయి. సిలోను తరంగాలు వస్తున్నాయి. ఢిల్లీ తరంగాలు వస్తున్నాయి. ఎన్ని తరంగాలు వచ్చినాగానీ ఒకదానికొకటి వేరుగా ఉంటున్నాయి. ఇదే భగవంతుని శక్తి రహస్యం. సూక్ష్మంగా ఉంది. అంతా క్లియర్‌గా ఉంటుంది. ఎప్పుడది క్లియర్‌గా ఉండదు? నీవు సరిగా ట్యూన్ చేయలేక పోయినప్పుడు న్యూస్ కాదు, నూసెన్సు వస్తుంది. కరెక్టు స్టేషన్‌కి నీవు ట్యూన్ చేయి, కర్‌క్టు న్యూస్ వస్తుంది. దీనినే 'ధ్యానం' అన్నారు. అనగా దేహం ఒక రెడియో, మైండు ఒక ప్లగ్. మీరు ధ్యానంలో కూర్చుంటే ఎప్పుడూ లేని తలంపులంతా వస్తుంటాయి. ఉన్నస్థానాన్ని వదలి మార్కెట్టుకు వెడుతుంది, యీ మైండు. కారణం ఏమిటి? సరైన ఏకాగ్రత చేయటంలేదు. ఏకాగ్రత చాలా ముఖ్యము. ఏకాగ్రత లేనప్పుడు జీవితమంతా వ్యర్థమై పోతుంది. Walking, thinking, talking, eating, writing అన్నీ concentration లోనే ఉంటున్నాయి. అన్నింటికి concentration ఉండాలి. కనుక, ధ్యానానికి టైం తీసుకొని కాలము వ్యర్థము చేయనక్కరలేదు. It is a way of life. అయితే meditation కి ప్రయత్నం చేయాలి. Meditation, concentration కి ఉన్న difference పిల్లలు తెలుసుకోవాలి. ఒక గులాబి మొక్క ఉంది. దానిలో అనేక కొమ్మలున్నాయి. పుష్పాలున్నాయి. ప్రతి పుష్పమునకు ఒక ముల్లుకూడా ఉంది. ఒకతూరి దానినంతా చూచావు. గులాబిమొక్క నీకు కనిపించింది. పువ్వును నీవు కోయాలనుకున్నప్పుడు కొమ్మలను రెమ్మలను అన్నింటిని ప్రక్కకు నెట్టాలి. నీ అలోచన ఆ పువ్వుపైనే పోవాలి. పువ్వుక్రింద ముల్లు వుంది. ఆ ముల్లును



sri sathyasai vachanamrutam

తప్పించుకొని పువ్వును కోయాలి. Love is a flower. Lust is a thorn. Don't touch the thorn, collect the flower. Concentration లో ఐదు senses చేరిపోతాయి. Meditation is beyond senses. ఈ రెండింటికి మధ్య contemplation అనిఉంది, contemplation cross అయినప్పుడే meditation start అవుతుంది. సైన్సులో చెబుతారు. క్రిందినుండి పైకి పోవాలనుకున్నప్పుడు మధ్యలో ఒక పొర ఉంది. దాని తరువాత ఈథర్ అని చెబుతారు. ఈథరును దాటినప్పుడు ప్రమాదము. మీరు చిన్న పిల్లలు మీకు తెలిసి ఉండదు. 15 సం॥ల క్రితము రష్యన్సు చంద్రమండలానికి పోవటంలో క్రాస్ చేశారు. ఆ బోర్డరు క్రాస్ చేసే సమయంలో ఫెయిల్ అయి చనిపోయినారు. ఎందువలన? ఆ వాతావరణం వేరు. పంచభూతములతో కూడినవి అక్కడ ఏమి ఉండవు. చంద్రమండలానికి పోయేవానికి అక్కడ కాలు పెడితే భూమి ఉందా లేదా అని తెలియదు. అక్కడ శరీరము తేలికయిపోతుంది. Meditation లో కొంతమంది శరీరాన్ని పైకి లేపుతారు; ఎందువల్ల? ఈ పంచభూతములు దానిలో లేవు. దానివల్లే తేలిక అయిపోయింది. సైంటిస్టులు సరిగా కనుక్కోటంలేదు. ఈ మూత ఉంది పైకి విడుస్తే వచ్చి పడిపోతుంది. కాటన్ ఉంది, విడిస్తే అది పైకి పోతుంది. ఎందుకోసం? అది తేలికగా ఉంది. తేలికగా ఉన్నది మీదకు పోతుంది. బరువుగా ఉన్నప్పుడు క్రిందపడిపోతుంది. మన కోరికల బరువు ఎక్కువ అయ్యేకొలది మనం క్రిందకు పడిపోతున్నాము. మన కోరికల తగ్గించుకున్నప్పుడు తేలిక అయి ఉన్నతస్థాయికి పోతాము.

**కోరికలు తగ్గేకొలది ఇచ్ఛాశక్తి పెరుగుతుంది**

పిల్లలు రేపటినుండి ట్రై చేయండి. మీకు ఎన్ని కోరికలున్నాయో మేము చెప్పలేము. కోరికలకు లిమిట్ లేదు. అప్పటికప్పుడు వచ్చే కోరికలు నిత్యజీవితంలో ప్రత్యేకంగా ఉంటాయి. ఉదయమునే లేచి గంజి త్రాగుతున్నావు. కాఫీ, టీ త్రాగి తరువాత టిఫిన్ తీసుకుంటున్నావు. తరువాత భోజనం, రాత్రికి డిన్నర్. ఇవన్నీకాక మధ్య మధ్య బిస్కట్లు తీసుకుంటున్నావు. ఇన్ని కోరికలు నీలో ఉంటున్నాయి. దినమునకు ఐదు పర్యాయములు కాఫీ త్రాగుతున్నావు. కొంతమంది దినమునకు ఏభై సిగరెట్లు కాలుస్తారు. ప్రత్యక్షంగా ఫలితం రావాలంటే కోరికలు తగ్గించండి. ఈనాడు ఐదుసార్లు కాఫీ తాగుతున్నావు.

srisathyasaivachanamrutam

రేపటినుండి మూడుతూర్లు తీసుకో. తగ్గించు. మెమరీ పవర్ పెరుగుతుంది. కోరికలు తగ్గే కొలది will power అధికమవుతుంది. అదే ఇచ్ఛాశక్తి. ఇచ్ఛాశక్తిని మనమీనాడు కోల్పోతున్నాము. ఇచ్ఛాశక్తిని కోల్పోవటంచేత క్రియాశక్తిలో నీవు అపజయం పొందుతున్నావు. అందువల్ల జ్ఞానశక్తి క్షీణిస్తున్నాది. ఆ will power అనేది will పైననే ఉండాలి. ఆ will ఎక్కడ ఉంది? మానవులలో free will లేకపోతే ఇది ఏమవుతుందో, ఫలిస్తుందో లేదో అని డౌట్స్ వస్తాయి. కనుక free will అనేది లేదు. ఏదైనా ఇంకో దానిపై ఆధారపడి ఉంటాయి. ఇప్పుడిక్కడ కూర్చున్నావు. పరుగెత్తి బయటకు పోవాలనుకున్నావు. నీకు అడ్డమున్నవాళ్లను తప్పించుకు పోవాలి కదా! కనుక అది నీకు అడ్డు. ఏ సంకల్పానికి గాని, ఏ కార్యమునకు గాని free అనేది లేనే లేదు. అనేక రకములైన అడ్డులు చేరిపోతాయి. భగవంతుని కొక్కనికే ఈ free will అనేది ఉంది. ఇంకెవరికి లేదు. నీవు భ్రమిస్తున్నావు free will ఉందని. నా ఇష్టము వచ్చినట్లు ప్రవర్తిస్తానని. అది free will కానే కాదు. అది నీ కోరికలయొక్క లక్షణము. కనుక free will అనేది ఒక్క దైవానుగ్రహంచేతనే మనం పొందటానికి వీలవుతుంది. free అంటే ఏమిటి? స్వాతంత్ర్యము Independent. In-depend ఇతరులపైన depend అవటమే. కనుక నీవు independent కానే కాదు. ఆత్మతత్త్వమే స్వాతంత్ర్యము. బాహ్యంగా దేహముతో, మనస్సుతో, బుద్ధితో కూడినది స్వాతంత్ర్యము కానే కాదు. అది స్వతంత్రము. భౌతికమైన జగత్తులో కొంతవరకు స్వతంత్రం ఉండవచ్చు కానీ ఏ నిమిషంలో ఎప్పుడు ఎక్కడ ఏవిధంగా జరుగుతుందో! ఒక చిన్న ఉదాహరణ. రెండవ తేదీ ఫిబ్రవరి సింహగర్జన చేస్తాను విజయవాడలో అన్నాడు రామారావు. రాత్రి రెండుగంటలకు మరణించాడు. ఇదంతా ఎక్కడుంది? ఇది వారి చేతిలో ఉందా? కేవలం ఒక్క దైవములోనే ఉంది. ఎవరికీ ఏ విధంగా అర్థంకాదు. మనం అనుకుంటాం, ఇదంతా స్వతంత్రమని, ఈ పని చేయవచ్చని, కానీ ఫలితం నీ చేతిలో లేదు. దైవంయొక్క చేతిలో ఉంది. జయాపజయములు దైవాధీనములు.

**జీవిత పరమావధి చాలా ముఖ్యం**

విద్యార్థులారా! ఆధ్యాత్మిక మార్గంలో ఎంతైనా దీనిని అర్థము చేసుకొని, దివ్యత్వమును

స్మరించి, ఈ లౌకికత్వాన్ని క్రమక్రమేణా కొంతవరకైనా విస్మరించి దైవత్వాన్ని సమీపించే మార్గాన్ని మీరు మీ విద్యతోబాటు చూచుకోండి. దీనిని వదలమని నేను చెప్పను. అయితే పవిత్రమైన మార్గంలో హింసలేకుండా, అసత్యము లేకుండా, బ్రహ్మచర్యమునకు లోటు కల్గకుండా, ఇతరుల వస్తువులను అపహరించకుండా, ఇలాంటివి మన నిత్యజీవితములో సులభంగా అనుసరించేవి చేయగల్గితే చాలు. ఎవరిదీ మనం దొంగిలించకూడదు. నీకు అవసరమైతే అడిగి తీసుకో! కొంతవరకు తప్పులేదు. అదికూడా తప్పే! అంత పెద్ద తప్పుకాదు. ఇంకా చాలామంది పిల్లలు తెలియక చిన్న చిన్న వాటిలో ప్రవేశిస్తున్నారు. తరువాత ఇవే పెరిగిపోయి పెద్ద వృక్షమైపోతాయి. పెరిగిపోయాక దీనినెవరు ఏమీ చేయటానికి వీలుకాదు. చిన్న మొక్కగానే దానిని త్రుంచివేయండి. ఇవీ ఈనాడు పిల్లలు నేర్చుకోవలసిన విషయాలు. మీ విద్యలెంత శ్రద్ధాభక్తులతో నేర్చుకుంటున్నారో ఆ శ్రద్ధాభక్తులను ఆధ్యాత్మికములోకూడా ప్రవేశపెట్టండి. ఈ లౌకిక చదువులన్నీ మనకు కొంతకాలము మాత్రమే పనికి వస్తాయి. రిటైరు అయ్యాక ఏమి వస్తుంది? చదివేది ఒకటి, మనం పని చేసేది మరొకటి. 'నేను బికామ్ పాస్ అయ్యాను. ఎంప్లాయిమెంటు ఆఫీసుకు అప్లైచేశాను. ఒకటి రెండు సంవత్సరములైనా నో రిప్లై', అనుకుని బాధ పడతావు. ఏమి చేస్తున్నావు ఆఖరుకి? ఏ పోలీసుగానో చేరిపోతావు. నీవు చదివింది వేరు, చేసేది పోలీసు ఉద్యోగం. పోలీసు ఉద్యోగంకోసం నీవు ఇంత శ్రమ ఎందుకు పడాలి? ఒకదానికొకటి సంబంధము లేకుండా జరుగుతుంది. ప్రపంచ జ్ఞానము అవసరమే! అంతేగానీ దీనితో ఇది పొందుతామని చెప్పటానికి వీలుకాదు. జీవిత పరమావధి చాలా ముఖ్యం. అదే దైవతత్త్వము. అట్టి ప్రేమ తత్త్వాన్ని మన హృదయంలోనుండి ఆవిర్భవింప చేసుకోవాలి.

**భగవంతుని అనుగ్రహముంటే ఎన్నైనా సాధించగలము**

భగవంతుని అనుగ్రహం ఒక్కటి ఉంటే ఎన్నైనా సాధించగలము. మీరు చూచారు, మొన్న గోరాకుంభార్ నాటకం. కుమారునిపై ప్రేమ ఉంది, బయట ఉన్నప్పుడు. ఆ కుమారునకు ఎన్నో బోధలు చేస్తున్నాడు. 'నాయనా! నీవు నామస్మరణ చేయి. ఇదే నీకు ఉపయోగించేది. ఇదే నీ పుట్టినరోజుకిచ్చే బహుమతి' అని ఎన్నో చెబుతూ వచ్చాడు.

srisathyasaivachanamrutam

పిల్లవాడంటే చాలా ప్రేమ. కానీ మట్టి  తొక్కుతున్న సమయంలో ఆ పిల్లవాడు మట్టిలో ప్రవేశించాడు. 'రంగా, రంగా' అని తన దేహాన్ని తాను మరచిపోయాడు. ఇంక పిల్లవాడెక్కడ జ్ఞాపకము వస్తాడు? ఆయొక్క తన్మయత్వములో పిల్లవానిని చంపివేసుకున్నాడు. తరువాత బాధపడ్డాడు. అది పశ్చాత్తాపము. అప్పటినుండి అతనిలో మార్పు కలిగింది. 'ఇచ్చినవాడు తానే, పుచ్చుకున్నవాడు తానే. ఇది నేను నా చేతితో చేసినదికాదు. వాని ప్రాణం నా చేతిలో లేదు. నేను తెలిసి చేయలేదు. ఇది తెలియక చేసింది. ఇదంతా దైవేచ్ఛ' అనుకున్నాడు. అప్పుడొక ప్రామిస్ చేశాడు. 'కన్నకుమారుని చంపుకున్నవాడను. ఇంక ఈ ప్రపంచముతో నాకు సంబంధము లేదు' అని భార్యకు మాట ఇచ్చాడు. 'ఈ దినంనుండి నేను నిన్ను టచ్ చేయను. నీకు నాకు సంబంధము లేదు. నీవు భార్యగా నేను భర్తగా వచ్చాము. ఇదంతా భగవంతుని నిర్ణయమే. నీ జీవితం నీవు గడుపుకో నా జీవితము నేను గడుపుతాను లేక ఇద్దరము కలసి భగవచ్చింతనలో జీవితం గడుపుకుందాం', అని చెప్పాడు. కానీ భార్య అంగీకరించలేదు. ఆమే అర్ధాంగి. వంశోద్ధారకుడు ఒక్కడైనా కుమారుడు ఉండాలని, పోనీ నన్ను టచ్ చేయకపోతే ఇంకో వివాహమైనా చేసుకోమని చెప్పింది. దానికి పూర్వం ప్రామిస్ చేశాడు, 'నిన్ను టచ్ చేయకుండా నీవు కోరినటువంటివి అన్నీ నేను నెరవేరుస్తాను' అని. ఆ పాయింటు పెట్టుకుంది భార్య. 'నన్ను టచ్ చేయవద్దు. ఇంకొకరిని వివాహమాడి వంశోద్ధారకుని ప్రసాదించ'మంది. ఆమెకు మాట ఇచ్చాడు. తప్పించుకునేందుకు వీలులేదు. ఆమె మాట ప్రకారం వివాహం చేసుకున్నాడు. కానీ 'నీకు నాకు సంబంధము లేదు పొమ్మ'న్నాడు. ఇచ్చిన ప్రామిస్‌ను సరిగా నిలబెట్టుకోలేకపోయాడు. యోచన చేశాడు. ప్రామిస్ ఇచ్చిన చేతులివి. ఈ చేతులతో ఇచ్చిన ప్రామిస్‌ను దక్కించుకోలేని ఈ చేతులెందుకని కత్తి తెచ్చి నరికేసుకున్నాడు. భగవచ్చింతన తప్ప అన్యము లేదనుకున్నాడు. కానీ హృదయాన్ని ఎరిగినవాడు భగవంతుడు. కనుక తక్షణమే ఒక బావమరిదిమాదిరి వచ్చి ఆ చేతులకు కట్టుకట్టాడు. తన పనిమనిషిగా భావిస్తూ వచ్చాడు. 'రంగా!' 'రంగా!' అని పని మనిషిగా పిలిచాడు. పిల్లవాడు పోయినమొదలు తల్లి ఏడుస్తోంది. చేతులులేని భర్త ఈ పరిస్థితిలో ఉన్నాడు. ఇంట్లో పనిచేసేవారెవరు లేరు. కనుక ఆయనే ఇంట్లో వంటలు చేయటం, సేవలు చేయటం ఈ విధంగా కాలం గడుపుతూ వచ్చాడు. ఎవరతను? ఆ

sri sathyasai vachanamrutam

పాండురంగడే, దైవమే! తానే వచ్చి అన్నీ చేస్తున్నాడు. ఒకానొక దినము పాండురంగడు, రుక్మిణి యిద్దరు వంటరూములో మాట్లాడుతున్నారు. రెండవ భార్య వినింది. ఎవరో ఆడవారు మాట్లాడుతున్నారే. వాళ్లచుట్టం వచ్చినట్లుందని అక్కతో చెప్పింది. తిరిగి వచ్చి చూసేసరికి ఆమెలేదు. అంతర్ధానమైపోయింది. దర్శనమునకుకూడా ఒక టైము రావాలి. భక్తులకు ఒక టైము రావాలి. దర్శన, స్పర్శన, సంభాషణలంటే అంత సులభం కాదు. కనుకనే అంతకాలం వాళ్ళు వేచి ఉండేవారు. ఇంటిలోనే తిరుగుతున్నారు. కానీ వారు దైవ స్వరూపులని వీరు గుర్తించలేదు. పండరీపురం వెళ్లారు. అక్కడ పాండురంగడు ప్రత్యక్షమై 'నాయనా! నీ మనస్సు పరీక్షించే నిమిత్తమై ఇన్ని రకములైన శిక్షలిచ్చాను నీకు. నీ మాటను నీవు దక్కించుకున్నావు. ఇదిగో నీ మరణించిన కుమారుడని ఇచ్చాడు. వారినందరినీ తనలోనే చేర్చుకున్నాడు. కట్టకడపటికి ఈ గోరాకుంభార్ మనోభీష్టాన్ని నెరవేర్చాడు. దర్శన, స్పర్శన, సంభాషణలంటే ఒక టైము కావాలి.

**భగవద్దర్శనం ఆశించిన తక్షణమే లభించదు**

ఋషులందరు భగవత్ దర్శనంకోసం కృతయుగంలో ప్రయత్నం చేస్తూ వచ్చారు. కానీ కృతయుగంలో దైవస్వరూపంలేదు. 'తస్మై నమఃకర్మణే' అని కర్మకు నమస్కారం చేసేవారు. ఒకనాడు దర్శనమిచ్చాడు. ఋషులు చూచారు. అప్పుడు వారు ప్రపంచమునకు చాటుతూ వచ్చారు. మేము చూచాము భగవంతుని. 'తమస్సుకు ఆవల ఉన్నాడు, సూర్యతేజస్సుతో ప్రకాశిస్తున్నాడు, కోటిసూర్యుల కాంతితో ఉన్నాడు, అతనిని మేము బయటకాదు లోపల చూచాము', అని వర్ణించారు. దర్శనం చేసుకున్నారు. తరువాత భగవంతుని ప్రార్థించారు, 'స్వామీ! దర్శనం చేసుకున్నాము. కానీ నీయొక్క సంభాషణ లభ్యముకాలేదే' అని. 'నాయనా! ఈ యుగంలో కాదు. త్రేతాయుగంలో మీకు సంభాషణ ఇస్తానన్నాడు. సంభాషణకు ఒక యుగం గడచిపోయింది. ఋషులందరు వానరులుగా పుట్టారు'. అప్పుడు శ్రీమన్నారాయణుడు శ్రీరామునిగా పుట్టాడు. అప్పుడు కోతులతో మాట్లాడుతూ వచ్చాడు. రాముడు ఒకచోట కూర్చున్నాడు. వీరంతా మరొకచోట కూర్చున్నారు. దానికి, దీనికి భేదం చెప్పాడు. 'నాయనా! మీరు వానరులుగా ఉన్నంతకాలం నరరూపంలోనున్న నన్ను



srisathyasaivachanamrutam

స్పర్శించటానికి వీలుకాదు. ఎందుకంటే నేను నర, మీరు వానర. వాలముంది మీకు, నాకు వాలము లేదు. వాలమంటే ఏమిటి? కోరికలు. వాటిని మీరు తగ్గించుకుంటేకానీ నా స్పర్శ చిక్కదు. నాపై మీరు పరిపూర్ణమైన concentration చేయాలి. మీకు ద్వాపరయుగంలో స్పర్శ ఇస్తానన్నాడు. ద్వాపరయుగంలో ఈ కోతులే గోపికలుగా కృష్ణుని స్మరించుకుంటూ వచ్చారు. భగవత్ నియమాలు చాలా ఉంటున్నాయి. ఇది మీరు ఆశించిన తక్షణమే లభించదు.

**మన ప్రవర్తనే మన మంచి, చెడులుగా రూపొందుతుంది**

త్రేతాయుగంలో రాక్షసులు ఒకచోట, దేవతలు మరొకచోట ఉన్నారు. అయోధ్యలో, కిష్కింధలో దేవతలున్నారు. దండకారణ్యములో రాక్షసులున్నారు. ఒక్కొక్క దేశంలో ఉన్నారు. రాక్షసులను చంపటానికి స్వయముగా రాముడే సిద్ధమయ్యాడు. తాను ప్రత్యేకంగా ఉన్నాడు. వారితో యుద్ధము చేసి ఆ రాక్షసులను సంహరించాడు. ద్వాపరయుగంలో అంతా ఒక గృహంలోనే ఉన్నారు. మేనమామ కంసుడు రాక్షసుడు. మేనత్త కుమారులైన శిశుపాలుడు, దంతవక్రుడు రాక్షసులు. ఇంకా అత్తకుమారులే కౌరవులు. వీరంతా రాక్షసులు. పాండవులు దేవతలు. వీరంతా ఒకే ఇంటిలో ఉన్నారు. ఒక ఇంటిలో ఉండటం వలన రాక్షసులకు సైన్యాన్ని ఇచ్చాడు. దేవతలకు, అస్త్రములు విసర్జించి కేవలం సాక్షీభూతంగా ఉంటానన్నాడు. సారథిగా మాత్రమే ఉన్నాడు. యుద్ధం చేయలేదు తాను. ఈ కలియుగం వచ్చేసరికి ఏమైంది? వారు వీరు ఒకే దేహములో ఉన్నారు. ఒక నిమిషంలో దుర్గుణాలు. ఒక నిమిషంలో సద్గుణాలు. ఒక నిముషములో సన్మార్గము. ఒక నిముషంలో దుర్మార్గము. ఎప్పుడు మంచి అవుతాడో ఎప్పుడు చెడ్డ అవుతాడో, ఎప్పుడు దేవుడౌతాడో, ఎప్పుడు వానరుడౌతాడో చెప్పటానికి వీలు లేదు. అందువల్ల కలియుగంలో దేవుడు ఏమి చేశాడు? ఆ బాధ్యత వానికే ఇచ్చాడు. నిన్ను నీవే శిక్షించుకోవాలి. నిన్ను నీవే రక్షించుకోవాలి. నేను సాక్షీభూతుడుగా నీలో ఆత్మగా ఉంటున్నాను. కనుక మానవుడు తన దోషాన్ని తానే గుర్తించుకొని తీసివేయటానికి తానే ప్రయత్నం చేయాలి. ఎందుకంటే ఇద్దరు ఒకే దేహంలో ఉన్నారు. ఈ బాధ్యత వానికే అప్పజెప్పారు. మంచిచెడులు రెండూ మన

sri sathyasai vachanamrutam

కర్మలద్వారా లభ్యమవుతున్నాయి. కొత్త సంవత్సరము వచ్చింది, ఏవార్త తెలుస్తుందోనని నీవు ఆశిస్తున్నావు. మన మంచిచెడ్డలు సంవత్సరం తీసుకుని రావటంలేదు. మన మంచిచెడ్డలు మనమే తెచ్చుకుంటున్నాము. మన ప్రవర్తనే మన మంచి చెడ్డలుగా రూపొందుతుంది. మన మంచి చెడ్డలు మనమే నిర్ణయించుకోవాలి. మంచిని పోషించుకోవాలి. చెడ్డను విసర్జించాలి.

దైవరహస్యాలు చాలా ఉంటున్నాయి. దానిని గుర్తించుకొనలేక స్వామి ఎందుకిలా చేస్తారని, స్వామి మాతో మాట్లాడటంలేదే అని అనుకుంటారు. ఒక్కొక్క దానికి ఒక్కొక్క రహస్యం ఉంటుంది. ఇవన్నీ నీలోనున్న మంచిచెడ్డలే గానీ భగవంతుని దోషంకాదు. ప్రతి దానికి మనలో మనం విచారణ చేయాలి. అదే self enquiry.

**ఉత్తమ విద్యార్థులనే పేరును నిల్పుకోవటమే స్వామికి ఇవ్వవలసిన కృతజ్ఞత**

విద్యార్థులారా! ఎవరిపైన మీరు ద్వేషము పెంచుకోవద్దు. మొట్టమొదట మీ భావాలను మీరు విచారించుకోండి, 'ఏ విధమైన భావంతో ఉన్నాం మనం ఇక్కడ', అని. ముందు ఒక విధముగా వెనుక ఒక విధంగా మనం ఉండకూడదు. మన ప్రామిస్ మనం నిలబెట్టుకోవాలి. ప్రాణం పోయినా సరే నిలబెట్టుకోవాలి. మార్గం ఒక్కటే! దివ్యమైన మార్గములో మీరు ప్రవేశించండి. యావత్ప్రపంచమునకే మీరు లీడర్సుగా తయారౌతారు. మన విద్యార్థులు అలాంటి లీడర్సుగా తయారవ్వాలని మీమీదే కొండంత ఆశపెట్టుకున్నాను. తల్లితండ్రులను సరైన రీతిగా మనం గౌరవించాలి. సమాజమునకు తగిన సత్యాన్ని నిరూపించాలి. దేశానికే ఈ విధమైన ఆదర్శము నిరూపించాలి. అలాంటి పిల్లలుగా తయారవ్వాలని నేను నా కాలములో మూడు వంతులు వారికే ఇస్తున్నాను. కానీ పిల్లలు దీనిని అర్థం చేసుకోటంలేదు. తమ స్వార్థం, స్వప్రయోజనం గుర్తిస్తూ పోతున్నారు. కాదు కాదు. విశాలం, విశాలం. స్వామి చెప్పిన పనులు చేయండి. మంచి పేరు తెచ్చుకోండి. విద్యలో మంచి ఉత్తీర్ణులు కండి. బయట ప్రపంచమునకు ఆదర్శమును నిరూపించండి. ఇంతకాలము మన విద్యాసంస్థలో ఉన్నందుకు ఫలాన శ్రీ సత్యసాయి విద్యాసంస్థ విద్యార్థి అనే పేరును నిలుపుకోండి. ఆ పేరు నిల్పుకోటమే స్వామికి ఇవ్వవలసిన కృతజ్ఞత. నేను

sri sathyasai vahini amrutam

మిమ్మల్ని ఏమీ కోరటం లేదు. పిల్లలు చెప్పారు. మాకు చొక్కా యిచ్చారు. సోప్ యిచ్చారు. ఇలా అన్ని నేను యివ్వటం కాదు. ఇవికాదు ముఖ్యం, మంచి బుద్ధి ఇచ్చాడని తెలుసుకోండి. Good mindని జాగ్రత్త చేసుకోండి. God mindనికూడా డెవలప్ చేసుకోండి. ఈ రెండింటిని మీరు డెవలప్ చేసుకుంటే దీనికి మించిన చదువు మరొకటి లేదు.

**(తేదీ 18-01-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam